
# నేనూ వూస్టరూ



**శ్రీనాథ్**

చిన్న తనంలో తొలిసారి 'వోడ్ హౌస్' నవల చదివి నప్పుడు తనకు ఏడుపు వచ్చిందని బుచ్చిబాబు ఎక్కడో వ్రాసినట్లు జ్ఞాపకం. నేనూ చిన్నతనంలో 'వోడ్‌హౌస్' నవల ఒకటి 'డామ్‌సెల్ ఇన్ డిస్ట్రెస్' అన్నది చదివాను. అది చదివినప్పుడు నాకు నిజంగా అసహ్యం వేసింది.

చిన్నతనంలో, జీవిత ప్రాంగణంలో అప్పుడప్పుడే ప్రవేశిస్తున్నప్పుడు వోడ్ హౌస్ సున్నితపు హాస్యం బహుశా నచ్చదు. మూడు నాల్గు దశాబ్దాల జీవితాన్ని చవిచూసి రకరకాల మనుష్యుల మనస్తత్వాన్ని అవగాహన చేసుకున్నాకా 'వోడ్‌హౌస్' నచ్చుతాడు. ఇప్పుడైతే నేను 'వోడ్‌హౌస్' నవల చదువుతున్నప్పుడు తెరలు తెరలుగా నవ్వు వస్తుంది. మనస్సు తేలికపడి హాయిగా ఉంటుంది.

'వోడ్‌హౌస్' నవలలో మనకుతరచు బెర్టీవూస్టరు కనుపిస్తాడు. అతని ప్రవర్తన ఉదాహరణప్రాయంగా చెప్పాలంటే ఇలా ఉంటుంది. వూస్టరు తనస్నేహితుని గదికి వెడతాడు. గది తీసి ఉంటుంది.

కాని, స్నేహితుడు గదిలో ఉండడు. పూస్టరు గదిలోకివెళ్ళి కుర్చీమీదకూర్చుని బల్లమీద ఏవేవో సవరిస్తూ ఉంటాడు. ఇంతలో బయట ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు అవుతుంది. పూస్టరు అలాగే కూర్చొని ఆ వచ్చిన వ్యక్తి స్నేహితుడైనా మరెవరైనా అతనితో మాట్లాడితే కథే ఉండదు. అందువల్ల పూస్టరు అలా చెయ్యడు. తన స్నేహితుని గదిలో తనను చూసి ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అని, గది లోంచి పారిపోడానికి ప్రయత్నిస్తాడు. ఇంతలో అవతల మనిషి గుమ్మందాకా వచ్చివేయడం వల్ల ఎటుపోవడానికి వీలు లేక, మంచంక్రింద దూరతాడు. స్నేహితుడు లోపలకువచ్చి మంచం క్రింద నుండి వచ్చే చప్పుడు ఏమిటా అను కుంటూ ఉంటాడు. మంచం క్రిందనుంచి చప్పుడు చేస్తున్నది పిల్లి అని తనస్నేహితుణ్ణి నమ్మించడం కోసం పూస్టర్ 'మ్యావ్' అని అంటాడు. కథ ఇలా సాగుతూ ఉంటుంది.

పూస్టరుకు ఉన్నట్లే మనకు కూడా మనస్సులోకొన్ని ముళ్లుఉంటాయి.వాటిని మనం విప్పి సాపు చెయ్యం. హేతు బద్ధంగా ఉండని మనం చేసే కొన్నిపను లనూ, మన అభిప్రాయాలను, ఇష్టానిష్టాలనూ మానుకోనూలేము. సంజాయిషీ చెప్పుకోనూలేము. ఇలాంటి మానసిక ప్రతిబంధకాలు కొన్ని అపూర్వ సంఘటనలకు, కొన్ని హాస్యకరమైన సంఘటనలకు దారితీస్తాయి. ఇలాంటి హాస్య సంఘటనలతో కథలూ, నవలలూ అల్లటమే వోడ్‌హౌస్ చేసేపని.

నిజంగా తరచి తరచి ఆలోచించి చూస్తే మనందరిలోనూ కూడా కొన్ని సందర్భాలలోనైనా కొంచెమో, గొప్పో 'పూస్టరు' ఉండి తీరతాడని నాకు తోస్తుంది. నా విషయంలో నాకు రెండు మూడు సందర్భాలలో నా ప్రవర్తన జ్ఞాపకం చేసుకొంటే నేనూ పూస్టరులాగే ప్రవర్తించేనా అనిపిస్తుంది.

నాకు పెళ్లిఅయిన కొత్తలో పండగకు అత్తవారింటికి వెళ్లేను భోజనం దగ్గర మొహమాటం పూర్తిగా పోలేదు. ఒక రోజు ప్రొద్దుట ఆ ఊళ్లోనే ఉన్న మా స్నేహితుణ్ణి చూడడానికి వెళ్లేను. కొంత సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక అతను భోజనానికి లేస్తూ, నన్నూ రమ్మన్నాడు. సరేఅని అతనితోపాటు భోజనం చేసి ఇంటికి వచ్చాను. ఇంకొంత సేపటికి మా మామగారు నన్నుభోజనానికి లెమ్మన్నారు. నేను సందిగ్ధంలో పడ్డాను. నేనుఅప్పుడేస్నేహితుని యింట్లో భోజనం చేసి వచ్చానంటే నేను మొహమాట పడి అలా అంటున్నాననుకొంటారేమో, "నిజంగా భోజనం చేశావా? మొహమాట పడి అలా అంటున్నావా? లేకపోతే భోజనానికి లే" అని మరీ మరీ మా మామ గారు అంటారేమో! ఆయనకు అలామాట రెట్టించే అలవాటు ఉంది. పదిసార్లు అలా అంటే నేను కాదన లేను. ఇలా ఆలో

చించి భోజనానికి కూర్చొని ఏ కాస్తో తిని లేవడమే మంచిది అనుకొన్నాను.

నాకు సహజంగా ఆకలి మందంగా ఉంది. అది నేను మొహమాట పడడమే అనుకొని పొరబడి, మా అత్తగారు నేను చాలు నన్నా కూడా మళ్లీ మళ్లీ వడ్డిం చారు. ఇలాటి ఇరకాటంలో నేను పడి ఉన్న సమయంలో - మా స్నేహితుడు అతని సతీమణి, నన్నూ మా శ్రీమతినీ చూడ్డానికి వచ్చారు. నేను భోజనం చేస్తు న్నానని విని వాళ్లు బ్రమాన్పడి పోయారు. "మా యింట్లో మీకుభోజనంసహించినట్టు లేదు" అని సున్నితంగా ఆమె నన్ను వేళాకోళం చేసింది కూడా. నేను వెను వెంటనే రెండుసారులు ఎందుకు ఇలా భోజనం చేశానో, ఎవరికీఅంతుపట్టలేదు.

మరొకమారు మా దగ్గర చుట్టాల యింట్లో పెళ్లికి రాజమండ్రి వెళ్లాను. వాళ్లయింట్లో పెళ్లి తెల్లవారుఝామున. ఆ రోజునే ఉదయం తొమ్మిది గంటలకు ఒక స్నేహితుని కూతురు పెళ్ళికూడా ఉంది. రెండు పెళ్ళిళ్లకు హాజరు కావచ్చు ననే వెళ్లాను. ఇద్దరు పెళ్ళికూతుళ్లకు బహుమతులు కొని తీసుకు వెళ్ళేను.

మావాళ్ల యింట్లో పెళ్ళి అయింది. తరువాత తొమ్మిది గంటలకు మా స్నేహితుని ఇంటికి వెళ్లేను వెళ్ళేటప్పుడు బహుమతి తీసుకొని వెళ్లలేదు. పెళ్ళివేళ ఆర్భాటంగా ఆ చిన్న బహుమతి చది వించడం నాకు నచ్చలేదు. మూడో కంటివాడికి తెలియకుండా పెళ్ళికూతురి చేతిలో బహుమతి పెట్టడానికి అప్పుడు అవకాశం చిక్కదు. అందుచేత రాత్రి భోజనానికి వచ్చినప్పుడు ఇద్దాం అను కున్నాను.

సుముహూర్తం అయేకా నేను వచ్చే స్తున్నప్పుడు మా స్నేహితుడు నన్ను భోజనంచేసి మరీ వెళ్లమన్నాడు. మా బంధువుల ఇంట్లో ఆ రోజే పెళ్లిఅయింది కదా! వాళ్లింట్లో మధ్యాహ్నం భోజనం చెయ్యక తప్పదు అన్నాను. నువ్వు రమ్మని పిలిస్తే రాత్రిరావడానికి సిద్ధంగా ఉన్నానన్న సూచన దానిలో ఉంది. మా స్నేహితునికి ఈ మాత్రం అర్థం కాకుండా ఉండి ఉండదు. కాని అతను 'అవునులెండి. వాళ్లింట్లో భోజనంచెయ్య డం న్యాయమే' అని ఊరుకున్నాడు. నేను మళ్ళీ ఆరోజు వాళ్లింటికి వెళ్ల నవ సరమూ పడలేదు, బహుమతి ఇయ్య డమూ పడలేదు.

ఇంటికి తిరిగి వచ్చాకా నా పెట్టెలో ఆ బహుమతి వస్తువు చూసి మావాళ్లంతా ఆశ్చర్యపోయారు. వాళ్లకు ఈ కథ చెప్పాను, అంతా నవ్వుకున్నారు. "మీ స్నేహితుడు రాత్రికి మిమ్మల్ని భోజ నానికి పిలవకపోతే మాత్రం సాయంత్రం వెళ్లి ఆ బహుమతి ఇచ్చి రాలేక పోయారా" అంది మా ఆవిడ. నాకూ ఆమాట తట్టకపోలేదు. నేను సాయంత్రం వాళ్లయింటికి వెడితే రాత్రి భోజ నానికి పిలిపించు కోడానికే వచ్చానను

కొంటాడేమో నాస్నేహితుడు అని నా బెంగ.

ఇంకొకమారు హైదరాబాదు వెళ్లాను. హైదరాబాదు వెళ్ళినప్పుడల్లా మాపెద తల్లి కూతురుగారి యింట్లో దిగడం నాకు రివాజు. ఆ మారూ అలాగేచేశాను. మా మేనత్త కొడుకు ఆ మధ్యనే బదిలీ అయి వచ్చాడు హైదరాబాదు. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. వాడిని చూసి చాలా రోజులు అయింది. ఆఫీసులో కలుసుకున్నాను. "మా పిల్లల్ని నువ్వు చూడనే లేదు. మా యింటికి ఒక్క మారు రా" అన్నాడు. 'ఎప్పుడురాను?' అన్నాను. 'రేపు' అన్నాడు. 'ఎన్ని గంటలకు' అన్నాను. 'సాయంత్రం ఏడు గంటలకురా' అన్నాడు.

నాకు స్వయంగా మేనత్త కొడుకు. సాయంత్రం ఏడుగంటలకు వాళ్ల ఇంటికి రమ్మంటే ఏమనుకోను? భోజనానికే అనుకొన్నాను.

మర్నాడు బయలుదేరేటప్పుడు మా అక్కయ్యతో చెప్పాను— మా మేనత్త కొడుకు ఇంటికి భోజనానికి వెడుతున్నాననీ, నా కోసం వంటచెయ్యవద్దనీ.

చాలాదూరంగా ఉన్న వాళ్లింటికి- వాకబు చేసుకుంటూ వెళ్ళేను. వాళ్లు చాలా ఆప్యాయంగా పలకరించేరు. వాళ్ల పెళ్లిలో మాత్రమే చూశా నామెను. మళ్ళీ చూడలేదు. ఇదే చూడడం. చాలా పరిచయంగా కలివిడిగా మాట్లాడింది. వెళ్లగానే కాఫీ ఇచ్చింది. ఇంతలేటుగా కాఫీ ఎందుకు, అలవాటు లేదన్నాను. పళ్ల రసం ఇచ్చింది. ఇది మాత్రం ఇప్పుడెందుకు? అన్నాను. 'భోజనానికిముందు' అని మాత్రం అనలేదు.

సుమారు రెండుగంటలపాటు ప్రపంచంలోని వ్యవహారాలన్నీ చర్చించాము. తొమ్మిదిగంటలు దాటినా వాళ్లు భోజనానికి తొందరపడుతున్నట్లు లేరు. చివరకు నేనే సున్నితంగా వాళ్లను తొందర చేస్తే బాగుంటుందని 'ఇక వెడతాను' అన్నాను. 'అవును టైము చాలాఅయింది మళ్లీ హైదరాబాదు వచ్చినప్పుడు మళ్ళీ తప్పకరండి' అన్నారు వాళ్లిద్దరూ.

ఆకలి దంచుతూఉంది. ఇప్పుడేమిటి చెయ్యడం. ఇంటికి వెడితే మా అక్క భోజనం సిద్ధంగాలేకపోయినా వండిపెడుతుంది. కాని ఈమాట...నేనువాళ్లింట్లో భోజనం చెయ్య లేదన్నమాట ఎవరికీ తెలియక పోతేనే మావాడి గౌరవం, నా గౌరవం దక్కుతాయి. తెలిస్తే ఇద్దరికీ నగుబాటే. అందుచేత దారిలోనిహోటల్లో భోజనంచేసి, రాత్రి పదిగంటలకు మా అక్కయ్యగారి యింటికి వచ్చాను.

మా అక్కయ్య "భోజనం చేశావురా?" అంది. ఆమె ఉద్దేశ్యం మా మేనత్త కొడుకు యింట్లోనని.

నేను "ఆఁ" అన్నాను. ఆమె నన్ను అడిగిన ప్రశ్నకు అది సమాధానమే కదా!

---